క్లుప్తంగా

2న మండల సమావేశం

ఎటపాక: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జూన్ 2న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విశాల్‌పాల్ శనివారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనునామని ప్రజాప్రతినిధులు ,అన్ని శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అరకులోయ రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం వెలుగు ఏపీఎం అప్పమ్మకు వీవోఏలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి భగత్‌రాం మాట్లాడుతూ వీవోఏలకు కాలపరిమిత సర్క్యులర్ రద్దు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. వీవోఏలు రాజ్‌కుమార్, మధు, ఆనంద్, రత్నమణి, జమున తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్త మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ డొంకినివలస గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త మజ్జి ఈశ్వరమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం స్థానిక నాయకులతో కలిసి గన్నేరుపుట్టు గ్రామానికి చేరుకుని ఈశ్వరమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. పార్టీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సర్పంచ్ వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు రాజారావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు


కథలు చెబుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం కథల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి సెట్టి సునీత మాట్లాడుతూ వేసవి శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, కథలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిబిరాలకు పంపించాలని కోరారు.

31న శాంతి హోమం

మాడుగుల: స్థానిక పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 31న శాంతి హోమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జాగాని పద్మలీల, కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆలయం వద్ద వారు మాట్లాడారు మత్స్య వంశ రాజులు కాలం నుంచి ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ దేవాలయంలో వివాహాలు ఇక నుంచి జరుగుతాయన్నారు.

మోదీ పాలన ఆదర్శనీయం

కొయ్యూరు: ప్రధాని మోదీ ప్రపంచంలోనే బలమైన నాయకుడిగా ఎదిగారని బీజేపీ పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు అన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొయ్యూరులో శనివారం పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. కోవిడ్ సమయంలో మోదీ సమర్థంగా వ్యవహరించారన్నారు. అనేక దేశాలకు కోవిడ్ టీకాలను ఉచితంగా పంపించారన్నారు. నాయకులు ఎం.అప్పలరాజు, ఈశ్వరరావు, చంద్రరావు, రాజు, మంగతల్లి, అచ్యుత్, అన్నపూర్ణ, దేముడు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సుపరిపాలన దేశానికే ఆదర్శం


గిరిజనులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


పడాల్‌పుట్టులో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


చింతకర్రపాలెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

చింతపల్లిరూరల్: గిరిజన గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా జనం నోట జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన మాట వినిపిస్తోంది అని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలోని లోతుగడ్డ పంచాయతీ పరిధిలో చౌడురాయి, రామయ్యపాడు, రామారావుపాలెం, మేడూరు, సరపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆయా గ్రామాల్లో 234 గడపలను సందర్శించారు. ఆమెకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల పొందుతున్న లబ్ధి గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో లబ్ధిపొందుతున్నామని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. జగనన్న సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, తామంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన మరింత చేరువైందన్నారు.

అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, లోతుగడ్డ సర్పంచ్ సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్ దూరియ పుష్పలత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, కో–ఆప్షన్ సభ్యుడు నజర్‌వలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు నేలకొన్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధంగా సుపరిపాలనను అందిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో గల కిలగాడ పంచాయతీ పడాల్‌పుట్టు, తాడిగిరి, కోపరిమామిడి గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గిరిజనులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 164 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతీ ఇంట్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని గ్రామాల్లో గిరిజన మహిళలు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వెల్లబుచ్చారు. గిరిజనుల నుంచి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతులు స్వీకరించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగనన్న పాలనలో జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకేల నిర్వహణ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అన్ని రాష్ట్రాలు ఏపీ వైపు చూసేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తోందని, ప్రజలంతా జగనన్న పాలననే కోరుకుంటున్నారన్నారు. కొత్తులబైలు గ్రామంలో మధ్యాహ్నం గడప గడప కార్యక్రమానికి వెళ్లగా స్థానికులు తాగునీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా గ్రామస్తులు వినకపోవడంతో ఆయన కార్యక్రమం నుంచి వెనుదిరిగారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు శివశంకర్, నరసింగరావు, ఎంపీడీవో రమేష్, వెలుగు ఏపీఎం దేవమంగ, పశువైద్యాధికారి సౌజన్యదేవి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు మూర్తి, జయదేవ్, చంటిబాబు, సన్యాసిరావు, జగన్నాథం, కొండలరావు, రామకృష్ణ, తిరుపతిరావుతో పాటు సచివాలయ సిబ్బంది, పలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

వై.రామవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వై.రామవరం సచివాలయం పరిధిలోని చింతకర్రపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మీల ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రాత్రి 7.30గంటల వరకు పర్యటించారు. గ్రామంలో 120 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమామణి, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, బలిరెడ్డి నూకరాజు, మడిబాబి, మద్దికొండ భారతిబాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మోదమ్మ జాతర


ముస్తాబైన మోదకొండమ్మ ఆలయం


విద్యుత్ దీపాలంకరణలో గంగమ్మతల్లి ఆలయం

- పెదబయలులో మూడు రోజులు నిర్వహణ
- శతకం పట్టు వద్ద కొలువుదీరనున్న అమ్మవారు
- భారీ స్థాయిలో ఏర్పాట్లు
- ఇతర రాష్ట్రాలనుంచి తరలిరానున్న భక్తులు


అధికారులకు సూచనలిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.పెదబయలులో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పాదాలను ఊరేగింపుగా శతకం పట్టువద్దకు తీసుకువెళ్లి కొలువుదీరుస్తారు. అమ్మవారి విగ్రహదాత జోగి రాము పండగ ప్రారంభిస్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు సరిహద్దు ప్రాంతమైన ఒడిశా నుంచి కూడా భక్తులు తరలివస్తారు. మూడో రోజు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉత్సవ విగ్రహం ,పాదాలను ఊరేగిస్తూ శతకంపట్టు నుంచి తిరిగి అమ్మవారి గుడిని విగ్రహాలు చేరుస్తారు. బాణాసంచా పెద్ద ఎత్తున కాలుస్తారు. మూడు రోజుల పాటు ప్రతిరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

విజయవంతానికి కృషి

ఉత్సవాలను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో పూర్ణయ్య, ఈవో ఆర్‌డీ నర్సింగరావు, వైస్ నెంపీపీ రాజుబాబు, సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ బొంజుబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంపరాయి సూరయ్య, ఎం.అప్పారావు, రూడ చిన్నయ్య, సన్నిబాబు,పోతురాజు, వర్తక సంఘం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురంలో కొలువైన గంగమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 వరకు జరిగే ఈ ఉత్సవాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు భారీ హోర్డింగ్‌లు, విద్యుత్ దీపాలతో అలంకరణ ఏర్పాటుచేశారు.


రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన కటౌట్

సౌర విద్యుత్ సమస్య పరిష్కరించండి

జి.మాడుగుల: గడుతూరు పంచాయతీ గుర్రాల గుమ్మి, పిల్లగోడు, పెద్దగెడ్డ, బందులపనుకు గ్రామాల్లో విద్యుత్ సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్ కె.అప్పలమ్మ తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ నాలుగు గ్రామాలకు గతంలో సోలార్ విద్యుత్ ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. సోలార్ విద్యుత్ కొద్ది రోజులుగా పాడవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయన్నారు. గ్రామాలన్నీ అడవి ప్రాంతంలో ఉండడంతో స్థానికులకు క్రూర జంతువులు, విష సర్పాల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

సారా బట్టీలపై దాడి: ఇరువురి అరెస్టు

రాజవొమ్మంగి: వేర్వేరు సంఘటనల్లో రాజవొమ్మంగి, జడ్డంగి పోలీసులు దాడి జరిపి శనివారం రెండు సారా బట్టీలను ధ్వంసం చేశారు. ఇరువురిని అరెస్టు చేసినట్టు తెలిపారు. మండలంలోని గడుఓకుర్తి పంచాయతీ దోనెలపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సారాబట్టిపై దాడి చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్టు జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. సంఘటనలో 50 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలో గ్రామ శివారులోని సుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో పొదల మాటున నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసినట్టు ఎస్‌ఐ గోపీనరేంద్రప్రసాద్ తెలిపారు. కన్నబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నామన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 50 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేశామన్నారు. నిందితులను అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచామన్నారు.

ప్రజా సమస్యలపై న్యాయ పోరాటం


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు దూలయ్య

రంపచోడవరం: మండలంలోని ఆకూరు పంచాయతీ పరిధిలోని యార్లమామిడి గ్రామంలో కామ్రేడ్ పల్లాల మాధవరెడ్డి అధ్యక్షతన అమరులైన కామ్రేడ్లు రాధ, సుధాకర్‌ల వర్ధంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు కామ్రేడ్ దూలయ్య మాట్లాడుతూ అమరుల సేవలు మరువలేనివన్నారు. ప్రజా సమస్యలపై న్యాయ పోరాటం కొనసాగిస్తామన్నారు. అనసూయ, లక్ష్మి, సోమిరెడ్డి, ప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: ప్రభుత్వం 90 రాయితీపై రైతులకు అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని లోతుగడ్డ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలను రైతులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయరంగానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు ప్రత్యేక సంక్షేమ పథకాలతో పాటు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలని ఏవో కన్నబాబు చెప్పారు. ఆర్‌బీకేలో వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్ సునీల్, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


సంపూర్ణ పోషణ సరకులను గర్భిణులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణిలకు అవసరమైన పోషకాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కిలగాడ పంచాయతీ పడాల్‌పుట్టు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పాల్గుణ శనివారం సందర్శించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులను గర్భిణులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గర్భిణులకు పోషక విలువలు కోసం ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణ్ సరకులు సక్రమంగా అందే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సిబ్బంది విధిగా పర్యటించి పౌష్టికాహారం ప్రాముఖ్యతపై వివరించి చైతన్య పరచాలన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు శివశంకర్, నరసింగరావు, సీడీపీవో వరహాలమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు మూర్తి, జయదేవ్, కొండలరావు, తిరుపతిరావు, రామకృష్ణ, బాబూరావు, సన్యాసిరావు, జగన్నాథం తదితరలు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత


పాదయాత్రలో స్వామిజీ, భక్తులు

జి.మాడుగుల: పాలకపాటి గురుదేవుల ఆశ్రమం (కృష్ణాపురం) రామానంద స్వామిజీ చేపట్టిన విశ్వశాంతి లోక కళ్యాణార్థం, సనాతన ధర్మ పరిరక్షణ పాదయాత్ర శనివారం జి.మాడుగుల మండలంలో కొక్కిరాపల్లి గ్రామంలో ప్రవేశించింది. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాజు పాటు అధిక సంఖ్యలో భక్తులు కలసి పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు.చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో పలు గ్రామాల్లో ఈ పాదయాత్ర ఆరు రోజులు పాటు నిర్వహించారు. కొక్కిరాపల్లి రోడ్డులో పాదయాత్ర భక్తులకు లోతుగెడ్డ జంక్షన్‌కు చెందిన డాక్టర్ రాజు, మండలానికి చెందిన యాతవ శ్రీను అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ కిముడు రాంబాబు, మత్స్యరాజు, బాబూరావు, శేఖర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలకు మార్గదర్శకాలు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కోసం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి మార్గదర్శకాలు రూపొందించారు. అన్ని జోనల్ క్యాడర్‌ల ఉద్యోగాలు, ఖాళీలను ఈ నెల 28లోగా సమర్పించాల్సి ఉంది. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 31లోగా వివరాలు సమర్పించాల్సి వుంటుంది. జూన్ 1 నుంచి 10 లోపు ఫిర్యాదులు పరిష్కరించడానికి అవకాశం కల్పించారు. వచ్చేనెల 16 నుంచి 20 వరకు జోనల్ కేడర్ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది

వాడ్రాపల్లిలో తోడపెద్దు పాలుకొలుపు

సేవగరిడీలతో తోడపెద్దుల ఊరేగింపు


వాడ్రాపల్లిలో తోడపెద్దు పాలుకొలుపులో భాగంగా సేవగరిడి



ఆకట్టుకున్న మహిళల సేవగరిడి

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో శనివారం తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల పాటు గ్రామంలో సేవ గరిడీలతో పండగ వాతావరణం నెలకొంది. 12 ప్రాంతాల నుంచి సేవగరిడీలతో వచ్చిన తోడపెద్దులను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులంతా తోడపెద్దులను సింహాద్రప్పన్నగా భావించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. తోడపెద్దు సేవలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన జరిపారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కొయిలాడ దశావతారం, రామజోగినాయుడు, కొణతాల అప్పారావు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయసేవలందించాలి

విశాఖ లీగల్ : బాధితులకు న్యాయం చేసే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎంవీపీ కాలనీలోని ఐఏఏంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసెక్యులర్ ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ క్రిమినల్ కేసుల స్థితిగతులను పరిశీలించాలన్నారు. బాధితులకు న్యాయం చేసే విధంగా తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. కీలకమైన కేసుల్లో ఎలా వాదనలు వినిపించాలో సూచించారు. హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయ సేవలు కోరుతూ వచ్చిన ప్రతి వ్యక్తికి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అదనపు పీపీలు ఎస్. దుష్యంత్ రెడ్డి, ఎం. శ్రావణ్ కుమార్, విశాఖ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు, పోక్స్ కోర్టు పీపీ కరణం కృష్ణ, 11వ, రెండో అదనపు జిల్లా కోర్టుల ఏపీపీలు బీవీఆర్ మూర్తి, సీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


వ్యాన్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మ

జి.మాడుగుల: చింతపల్లి రోడ్డు మార్గంలో సాడేకు వద్ద శనివారం చెట్టునీడలో పార్కింగ్ చేసిన వ్యాన్‌పై ఒక్కసారిగా కొమ్మ విరిగిపడింది. శ్రీ రామనంద స్వామి చేపట్టిన సనాతన ధర్మ పరిరక్షణ పాదయాత్రలోని భాగంగా సాడేకు గ్రామంలో ఒక భక్తుని ఇంటి వద్ద నీరు తాగటానికి భక్తులు వెళ్లారు. ఆ సమయంలో రోడ్డు పక్కన ఓ చెట్టు కింద వ్యాన్‌ను పార్కింగ్ చేశారు. ఇంతలోనే హఠాత్తుగా చెట్టు కొమ్మ వ్యాన్‌పై విరిగి పడింది. వ్యాన్‌లో భక్తుల బ్యాగ్‌లు, వంట సామగ్రిని ఉన్నాయి. ఆ సమయంలో వ్యాన్‌లో డ్రైవర్ మినహా ఎవరూ లేరు. సంఘటనలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ రోడ్డులో సుమారు గంట పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీ పాకలపాటి గురుదేవుల భక్తులు చెట్టు కొమ్మలను తొలగించి వాహన రాకపోకలు పునరుద్ధరించారు.